క్లుప్తంగా

15 లోగా ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలి



పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఓర్వకల్లు: ఈనెల 15వ తేదీలోగా ఈ క్రాప్ ప్రక్రియ నమోదు పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని నన్నూరు, లొద్దిపల్లి, హుశేనాపురం, ఉయ్యాలవాడ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి పంట నమోదులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో 13,390 ఎకరాల్లో పంట నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన పంటలను ఈ నెల 15లోగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

పత్తి పంటలో సస్య రక్షణ చేపట్టాలి



వర్మీకంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: పత్తి పంటలో హైడ్రోజెల్ ప్రాముఖ్యత, గులాబీ రంగు పురుగు నివారణకు సస్య రక్షణ చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. మంగళవారం తడకపల్లె గ్రామంలో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యజమాన్య సంస్థ) ఆధ్వర్యంలో పత్తి పంట చేస్తున్న రైతు సోమన్న వ్యవసాయ క్షేత్రంలో ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం పద్ధతుల గురించి తెలియజేసి వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ గురించి రైతులకు వివరించారు. పత్తి పంటలో బెట్ట నివారణకు జీబా, గులాబీ రంగు పురుగు నివారణకు ఫిరమోన్ పేస్ట్‌ను పొలంలో వేశారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కల్లూరు: ముురుగు కాలువ పనుల్లో నాణ్యత పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం చిన్నటేకూరు గ్రామంలో జరుగుతున్న మురుగు కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో పనులు జరుగుతున్నాయన్నారు. డ్రైనేజీ పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

14 నుంచి మండల క్రీడలు ప్రారంభం

పాణ్యం: ఈనెల 14 నుంచి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడలు ప్రారంభమవుతాయని ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్‌తో పాటు అథ్లెటిక్ పోటీలు ఉంటాయని, ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా చూడాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. మండల స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

312 కొత్త పింఛన్ల మంజూరు

గడివేముల: మండల పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో కొత్తగా 312 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప మంగళవారం తెలిపారు. రెండో విడత వెరిఫికేషన్ పూర్తి కావడంతో లబ్ధిదారులకు బుధవారం ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా వలంటీర్లు అందజేస్తారన్నారు.

నేడు కొత్త పింఛన్లు పంపిణీ

కోడుమూరు రూరల్ : మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో రెండవ విడత కింద మంజూరైన కొత్త పింఛన్లను బుధవారం అందజేస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. 214మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లను మంజూరు చేసిందని, బుధవారం ఆయా గ్రామ సచివాలయాల వద్ద లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. కోడుమూరుకు చెందిన లబ్ధిదారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పింఛన్లు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: మండలంలోని కే నాగులాపురం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గూడూరు సబ్ స్టేషన్ ఏఈ శ్రీనివాసనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కే.నాగులాపురం సబ్ స్టేషన్ నుండి చిల్లబండ సబ్ స్టేషన్‌కు కొత్త లైన్ పనులు జరుగుతున్నందున బూడిదపాడు, కే.నాగులాపురం,పెంచికలపాడు, గుడిపాడు, ఆర్ .ఖానాపురం గ్రామాలకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

దేశానికే ఆదర్శం నవరత్నాలు

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్రాలు పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం భూపనపాడు, మద్దూరు గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. భూపనపాడులో మురుగు కాలువ సమస్యకు శాశ్విత పరిష్కారం చూపుతామన్నారు. అంతర్గత రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని ప్రజలను కోరారు.

రైతులకు సాగునీరు

ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు త్వరలోనే సాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెప్ప ఉత్సవాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ప్రజలు తెప్పకు కొబ్బరికాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం గోరుకల్లు జలాశయంలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుందన్నారు. త్వరలోనే ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు నీరు అందిస్తామని, ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీటీసీలు సుధారాణి, లక్ష్మీదేవి, సర్పంచ్‌లు జనార్దన్, ప్రదీప్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రామలక్ష్మయ్య, మనోహర్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దూరు గ్రామంలో..

మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి మంగళవారం తెలిపారు. వలంటరీలు, సచివాలయ ఉద్యోగులు తప్పక హాజరు కావాలన్నారు.



భూపనపాడులో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

ప్రజలను తిప్పుకోవద్దు

పాణ్యం: ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు పనులు చేసిపెట్టాలని రాంభూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. రిజిస్ట్రేషన్లు ఆలస్యమవుతున్నాయని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం ఆయన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. చిన్న చిన్న సమస్యలను సాకుగా చూపి పదేపదే తిప్పకుండా ఇరుపక్షాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం రిజిస్ట్రేషన్ల వివరాలు అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాఫ్ట్‌వేర్ సమస్యలపై సబ్ రిజిస్ట్రార్ తేజోవతిని అడిగి తెలుసుకున్నారు.

గృహ నిర్మాణాల వేగం పెంచాలి

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని జగనన్న లేఅవుట్‌లో చేపట్టిన గృహ నిర్మాణాల వేగం పెంచాలని హౌసింగ్ ఏఈ జమ్మన్న లబ్ధిదారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారంజగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో 87 మంది లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేయగా, 90 శాతానికి పైగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే 40 శాతం మేరకు లబ్ధిదారులు గృహాలను పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. వచ్చే నెల దసరాలోపు మరిన్ని గృహాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

'సుంకేసుల'కు 375 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎగువ నుంచి రిజర్వాయర్‌కు మంగళవారం 375 క్యూ సెక్కుల వరద నీటి ఇన్ ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 331 క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యామ్ పూర్తి స్థాయి నీటి నిల్వ స్థామర్థ్యం 1.20 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు వివరించారు. దిగువకు నీటి విడుదల నిలిపివేశామని పేర్కొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిషత్తు

గడివేముల: క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష త్తు ఉంటుందని ఎంఈఓ -2 విమలా వసుంధర దేవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడాపోటీలను మంగళవారం ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. చదువు, క్రీడలతోపాటు ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీ భుజంగరావు, ఆయా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

మండల పరిధిలోని ఆళ్లగడ్డ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ -2 విమలా వసుంధర దేవి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతగా తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు.



కబడ్డీలో హోరాహోరీగా తలబడుతున్న విద్యార్థులు

నేడు బహిరంగ వేలంపాట

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో తలనీలాల సేకరణకు బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామక్రిష్ణ మంగళవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు మధ్యాహ్నం 12 గంటలకు దేవస్థానం వద్దకు చేరుకోవాలన్నారు.

క్రైం కార్నర్

కోలుకోలేక వీఆర్వో మృతి

ఓర్వకల్లు: కాలినడకన వెళ్తూ ప్రమాదవశాత్తూ కింద పడి గాయపడిన కాల్వ వీఆర్వో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన గోవిందస్వామి(47) కాల్వ వీఆర్వోగా పనిచేస్తున్నాడు. ఈనెల 8న విధులు ముగించుకుని కాలి నడకన ఇంటికి వెళ్తుండగా కళ్లు తిరిగి పడిపోయాడు. తోటి ఉద్యోగులు వెంటనే కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పలువురు.. వీఆర్వో కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబసభ్యులు మృతుడి అవయవాలను దానం చేశారు. కాగా ఒత్తిళ్ల కారణంతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు

గడివేముల: మండల పరిధిలోని బూజునూరు హెచ్‌పీ పెట్రోల్ బంకు సమపంలో ఆటో కిందపడటంతో పలువురికి తీవ్రగాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. పెసవాయి గ్రామానికి చెందిన కొంత మంది కూలీలు మంగళవారం ఆటోలో గడివేములకు వెళ్తుండగా హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద అదుపు తప్పి కిందపడింది. ప్రమాదంలో గ్రామానికి చెందిన సంపత్, అబ్బీ, జ్యోతితో పాటు పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు.

క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన శోభనాథ్ సింగ్

కల్లూరు: తడకనపల్లె సమీపంలోని క్వారీ గుంతలో పడి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శోభనాథ్ సింగ్ (31) అనే వ్యక్తి మృతిచెందాడు. మృతుడు నాగసుబ్బారెడ్డి క్వారీ వద్ద టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున టిప్పర్ లోడ్ చేసుకుని క్వారీలో నుంచి బయటకు వస్తుండగా ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడు. మీద టిప్పర్ సైతం పడటంతో ఊపిరాడక ప్రాణాలొదిలాడు. ఈ మేరకు మృతుడి స్నేహితుడు జితేంద్ర సింగ్ ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ మృతి

మంత్రాలయం: మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ నరసప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధవరం నుంచి రచ్చుమర్రి గ్రామానికి వెళ్తుండగా బాట మారెమ్మవ్వ గుడి వద్ద వీఆర్‌ఏ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ముందుగా వెళ్తున్న ఎద్దుల బండిని ఢీకొట్టింది. దీంతో నరసప్ప (40) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మార్తమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మాధవరం పోలీసులు ప్రమాదంపై విచారణ చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 40వ వార్డు బాలాజీ నగర్‌లో కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, గిప్సన్, సాంబతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి నాలున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల లబ్ధిని అర్హులైనవారందరికీ అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పాలన కొనసాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతాపం

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని స్టాంటన్‌పురానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఖాజా (30) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ స్టాంటన్‌పురంలోని ఖాజా నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోన్, కార్పొరేటర్ సాంబ, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయండి



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: అధికార యంత్రాంగం మండల సమగ్రాభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఎంపీపీ బొంతల మునెప్ప సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లడతూ పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో అలసత్వం తగదని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల సమాచారం, కార్యక్రమాల వివరాలు ప్రజా ప్రతినిధులకు తెలియకుండా అధికారులు నిర్వహిస్తున్నారని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. సంగాల సర్పంచ్ హనుమంతు ఉపాధి, విద్యా శాఖ అధికారుల తీరు సరిగా లేదని మండిపడ్డారు. సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు, మరికొందరు ఆలస్యంగా హాజరు కావడంపై ఎంపీపీతోపాటు సభ్యుల తప్పుపట్టారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తలారి బీసమ్మ, హౌసింగ్ డీఈ వాసుదేవరావు, తహసీల్దార్ శేషఫణి, ఈఓఆర్డీ సందీప్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలపై దృష్టిసారించాలి

● డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



గొల్లలదొడ్డిలో జామ చెట్లను పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

సి.బెళగల్: రైతాంగం ఉద్యావన పంటల సాగుపై దృష్టి సారించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఏఈఓ లక్ష్మన్న, ఈసీ పృధ్విరాజ్, టీఏలతో కలిసి మండలంలోని పోలకల్, గొల్లలదొడ్డి, సి.బెళగల్ గ్రామాలలో పర్యటించారు. ఉద్యానవన పంట సాగులో భాగంగా రైతులు నాటుకున్న జామ, కొబ్బరి పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో మెలుకువలను, పథకం ద్వారా అందే సహాయ సహకారాలను తెలియజేశారు. పండ్లు, పూల తోటల పెంపకాలకు ముందుకు వచ్చే రైతులుకు వంద శాతం సబ్సిడీపై మొక్కలను అందజేయడంతో పాటు నిర్వహణ ఖర్చులను సైతం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తుందని వివరించారు. అదేవిధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, ఉపాధి సిబ్బంది, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించిన పీడీ ఉపాధి పనుల నిర్వహణపై సూచనలు చేశారు. కూలీల పెండింగ్ వేతనాలు చెల్లింపు అయ్యేలా చూడాలని పీడీ సూచించారు. అదేవిధంగా చెత్త సేకరణ కేంద్రాలు, గోలకులం షెడ్ల నిర్మాణాలు, వేతనాల బిల్లులు వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్ ఇతర శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేయండి

● కలెక్టర్ డాక్టర్ జి.సృజన



పునరుద్ధరణ పనులనుపరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని ఆధునీకరణ పనులను నాణ్యతగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. సీపీఓ కార్యాలయంలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా, నాణ్యతా ప్రమాణాలతో చేయాలని సూచించారు. ఆమె వెంట సీపీఓ జేడీ ఎల్.అప్పలకొండ ఉన్నారు.

నేడు జి.సింగవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని జి.సింగవరంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అజాంఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తారన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని సూచించారు.

పిల్లిగుండ్లలో డెంగీ నిర్ధారణ

గోనెగండ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్లలో రెండు డెంగ్యూ కేసులు నమోదైనట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. మంగళవారం వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి నీళ్ల నిల్వ ఉన్న చోట శుభ్రం చేయించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇళ్లలోని బకెట్, డ్రమ్ములు, గచ్చులలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోరాదన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ బాధితుల ఇళ్లకు వెళ్లి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. డివిజన్ మలేరియా అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్ హనుమంతు, పరమేష్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్ : జగనన్న గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన గృహాలను లబ్ధిదారులంతా త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ హౌసింగ్ ఏఈ లక్ష్మన్నతో కలిసి మండలంలోని ప్యాలకుర్తి జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం లబ్ధిదారులకు అవసరమైన రోడ్లు, మంచినీరు, కరెంట్ వంటి వసతులను కల్పించిందని, గృహ నిర్మాణాలను పూర్తి చేసుకుంటే వాటికి సంబంధించిన బిల్లులను కూడా మంజూరు చేస్తోందన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

ఎంపీడీఓ చంద్రశేఖర్ ప్యాలకుర్తి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ప్రతి రోజు సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు.



తలపడిన దున్నలు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో మంగళవారం రెండు దున్నపోతులు పోట్లాడుకున్నాయి. గ్రామస్తులు కర్రలతో కొట్టినా ఎంతకూ వదల్లేదు. చివరకు రెండు దున్నపోతుల కాళ్లకు తాళ్లు కట్టి లాగి కొమ్ముల మధ్య కర్రలతో కొట్టి విడిపించాల్సి వచ్చింది.

గడువులోపు స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): రీసర్వేకు సంబంధించి స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండలాల ప్రత్యేకాధికారులు, హౌసింగ్, పీఆర్ ఇంజినీర్లతో వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో రోవర్‌కు 100 స్టోన్లను ప్లాంటేషన్ చేయాల్సి ఉందన్నారు. గూడూరు, కోడుమూరు మండలాలు స్టోన్ ప్లాంటేషన్‌లో వెనుకబడి ఉన్నాయన్నారు. ఆస్పరి, కోడుమూరు మండలాల్లో లక్ష్యం మేరకు రోజుకు ఐదారు ఇళ్ల స్టేజీ కన్వర్షన్ కూడా మారడం లేదని ఆయా ఎంపీడీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంప్లీషన్ స్థాయిలో గోనెగండ్ల, కౌతాళం, ఆదోని మండలాల్లో పురోగతి కనిపించక పోవడంతో సంబంధిత హౌసింగ్ ఏఈలను ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సిద్దలింగమూర్తి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.